


బుధవారం 29 ఏప్రిల్ 2026 పేజీలు : 8

## నకిలీ విత్తనాల దందా.. ముగ్గురు అరెస్ట్

**175 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు సీజ్**

**ఏపీ నుంచి తెచ్చి అమ్మకాలు..రైతులకు కుచ్చుటోపీబి**

**రూ.4.37 లక్షల విత్తనాలు పట్టుకున్న రెబ్బెన పోలీసులు**



# అట్టహాసంగా బీఆర్ఎస్ ఆవిర్భావం

- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో అంబరాన్నంటిన సంబురాలు
- ఊరూరా రెపరెపలాడిన గులాబీ జెండాలు
- కేక్‌లు కట్ చేసి.. మిఠాయిలు పంపిణీ చేసిన నాయకులు
- తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు
- కేసీఆర్ తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని ప్రశంసలు



**కుమ్రం భీం ఆసిఫాబాద్**

కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో బీఆర్ఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం అంబరాన్నంటాయి. శ్రేణులు ఊరూరా సంబురాలు నిర్వహించాయి. బీఆర్ఎస్ కార్యాలయాలు, ప్రధాన చౌరస్తాల్లో పార్టీ అధ్యక్షులు, నాయకులు గులాబీ జెండాలు ఎగరేసి.. జై తెలంగాణ.. జై కేసీఆర్.. జైజై కేటీఆర్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కేక్‌లు కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీలోని తెలంగాణతల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పూలమాల వేశారు. అనంతరం మంచిర్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అలుపెరుగని పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని, అహోరాత్రులు కష్టపడి పనిచేసి తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలిపారని గుర్తు చేశారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గొడిశెల సంధ్యారాణి-రాజారమేశ్ పార్టీ జెండా ఆవిష్కరించారు



# నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నాము

- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి
- బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి
- పాల్గొన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



# కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

## మేడే సదస్సులు విజయవంతం చేయాలి గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం

## మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో 140 మే డే వాల్ పోస్టర్లు విడుదల



**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, మేడే సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం కోరారు. మంగళవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో మేడే సందర్భంగా 140 వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవి సత్యం మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను కోరారు. మంచిర్యాల జిల్లా యంత్రాంగం పరిశుభ్రత కార్మికుల సంఖ్యను పెంచాలని, ప్రతి డివిజన్‌కు కనీసం 8 మంది కార్మికులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. పని భారం పెరిగిన నేపథ్యంలో కార్మికుల సంఖ్య పెంపు అత్యవసరమ ని తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తూ తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా పని చేసిన కార్మికులు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని, 60 సంవత్సరా లు పూర్తి చేసిన కార్మికుల స్థానాల్లో వారసత్వ ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మంచిర్యాలలో మరణించిన కార్మికుల స్థానాల్లో తక్షణమే వారసత్వ ఉద్యోగాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని సూచించారు.కార్మికులకు ఇవ్వాల్సిన పింఛన్లు, ఇతర ప్రయోజనాల ను వెంటనే పరిష్కరించాలని, ఇతర రంగాలతో పోలిస్తే పరిశుభ్రత కార్మికుల జీవన పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను అణచివేసే విధంగా తీసుకువస్తున్న చట్టాలను వ్యతిరేకించాలని, కార్మిక చట్టాలను బలహీనపరుస్తున్న చర్యలను ఖండించాలని పిలుపు నిచ్చారు.రాష్ట్ర, కేంద్ర స్థాయిలో సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని, ఉద్యమాల ద్వారానే హక్కులు సాధ్యమవు తాయని చరిత్ర చెబుతోందన్నారు. తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘాన్ని బలోపేతం చేయాలని, సంఘానికి ఆర్థిక సహాయం అందించాలని ఆయన కోరారు.

# వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయండి

## సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్.ఐ. హైమ







**మంచిర్యాల, 28 ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**నర్సింగ్ విద్యార్థులకు 'షీ టీమ్స్', లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక"లో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యం లో జిల్లా వ్యాప్తంగా మహిళలు, పిల్లల భద్రతపై ఆరు రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్.ఐ. హైమ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంచిర్యాల ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో మహిళలు, పిల్లల భద్రత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన వంటి అంశాలపై విద్యార్థిను లకు వివరించారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను తెలియజేసి, వ్యక్తిగత భద్రతపై జాగ్రత్తలను పాటించాలని సూచించారు.పని ప్రదేశాల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు గురైతే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని, ఎలాంటి భయం లేకుండా బాధితులు ముందుకు రావాలని హామీ ఇచ్చారు.స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా ద్వారా జరిగే సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు.సమాజ అభివృద్ధికి లింగ సమానత్వం ఎంతో కీలకమన్నారు. మహిళలు--పురుషులు సమాన హక్కులు, అవకాశాలు పొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ద్వారా సమానత్వం సాధ్యమవుతుందని వివరించారు.బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్యగా పేర్కొని, ఇవి ఆరోగ్య సమస్యలు, విద్యలో అంతరాయం, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తాయని చెప్పారు. చట్టపరంగా బాల్య వివాహాలు నిషేధించ బడ్డాయని స్పష్టం చేస్తూ, 18 సంవత్సరాల లోపు బాలికల వివాహాలు జరగకుండా సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలపై సమాచారం తెలిసిన వెంటనే హెల్ప్‌లైన్ 1098కు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు.భవిష్యత్తులో నర్సింగ్ వృత్తిలో చేరబోయే విద్యార్థినులు తమ వృత్తి జీవితంలో కూడా భద్రతా నియమాలను పాటిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, అసిస్టెంట్ ప్రొఫెసర్ వనజ, అధ్యాపక బృందం, షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు సతీష్, జ్యోతి మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

## పెళ్లిరోజు సందర్భంగా పెరుగన్నం పంపిణీ



**మంచిర్యాల, 28,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, శ్రీమతి సురేఖ ల పెళ్లిరోజు సందర్భంగా మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా 11వ డివిజన్ కార్పొరేటర్ సుధమల్ల హరికృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో పెరుగన్నం పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ గారు, కార్పొరేటర్ కాశీ శ్రీనివాసరావు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజా సేవే ముఖ్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా చేపట్టాలన్నారు.

## నాల్గవ వారం కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ



**జన్నారం,ఏప్రిల్28(ప్రజాజ్యోతి)**పూర్ణచంద్రరావు ఫౌండేషన్ (పి.సి.ఆర్) ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రంలో గత 4 వారాలుగా ప్రతి మంగళవారం మజ్జిగ పంపిణీ కొనసాగుతోంది. ఎండలు మండుటుండటంతో వార సంతకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ తెలిపారు. వేసవికాలం పూర్తయ్యేవరకు ప్రతి మంగళవారం మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్వర్ అలీ ఖాన్, నోముల రాజ్ కుమార్, రాజేష్, హరీష్, మల్లేష్, పీసీఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజాజ్యోతి "కథనానికి స్పందించిన అధికారులు



**మంచిర్యాలరూరల్ ఏప్రిల్28(ప్రజాజ్యోతి)** మంచిర్యాల కార్పొరేషన్ పై ప్రజాజ్యోతి పత్రికలో ఏప్రిల్ 19న ప్రచురితమైన "ప్లాస్టిక్ భూతానికి సలాం కొడుతున్న కార్పొరేషన్" అనే కథనంపై కార్పొరేషన్ అధికారులు స్పందించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్లాస్టిక్ విక్రయాలు నిర్వహిస్తున్న వ్యాపారుల వద్ద నుంచి భారీ మొత్తంలో ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని,నిషేధిత ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని సానిటరీ సూపర్వైజర్ కుమారస్వామి వ్యాపారులను హెచ్చరించారు.ప్రజలు సైతం పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని,ప్లాస్టిక్ వినియోగాన్ని రూపుమాపాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ టికెట్‌కు నిట్టూరి జనార్ధన్ ఆశావాహి



**జైపూర్ ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి)** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్ ఆశావాహుల సందడి మొదలైంది. ఈ క్రమంలో జైపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నిట్టూరి జనార్ధన్ ఎంపీటీసీ టికెట్ కోసం తన అభ్యర్థిత్వాన్ని బలంగా వినిపిస్తున్నారు. దీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కొనసాగిస్తున్నానని పార్టీ కష్టకాలంలో కూడా వెనక్కి తగ్గకుండా కష్టపడ్డానని నిట్టూరి జనార్ధన్ తెలిపారు. ఎన్నో ఆటంకాలు రాజకీయ ఒత్తిడులు ఎదురైనా పార్టీ పట్ల నిబద్ధతతో ముందుకు సాగానని చెప్పారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి, గ్రామ స్థాయి నుండి ప్రజలతో సన్నిహిత సంబంధాలు పెంచుకున్నానని పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థిగా అవకాశం ఇస్తే ఎంపీటీసీ స్థానాన్ని గెలుచుకొని కాంగ్రెస్ పార్టీకి బలమైన స్థానం తీసుకువస్తానని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని అన్నారు. తనకు మండలంలోని అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని వారి ఆశీర్వాదంతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఉన్నత నాయకత్వం తన సేవలను గుర్తించి ఎంపీటీసీ టికెట్ కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పారదర్శకంగా చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సెలింగ్



**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా వ్యాప్తంగా ఎస్సీడబ్ల్యూవ ఉద్యోగులు (కార్మికులు) కోసం చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సెలింగ్‌ను మంగళవారం ప్రగతి స్టేడియంలోని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్ (సీఈఆర్ క్లబ్)లో నిర్వహించారు. ఇప్పటికే క్వార్టర్లు కలిగి ఉన్న ఉద్యోగులు తమకు అనుకూలమైన లేదా మెరుగైన క్వార్టర్లు ఎంచుకునేలా ఈ కౌన్సెలింగ్ ను ఏర్పాటు చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని నస్పూర్, గోదావరి కాలనీ, ఆర్‌కే-6 కాలనీ, టీచర్స్ కాలనీ, సీసీసీ టౌన్షిప్, కృష్ణ కాలనీ, శ్రీరాంపూర్ కాలనీ, ఆర్‌కే-8 కాలనీలలో ఖాళీగా ఉన్న మొత్తం 416 క్వార్టర్లకు ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 416 క్వార్టర్లలో 83 మంది ఉద్యోగులు తమకు నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ రమణరావు, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, సీనియర్ పీఓ ప్రశాంత్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో సీనియారిటీ ఆధారంగా ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించారు.

## అర్హులకు రెండు పడక గదుల ఇండ్లు అందిస్తాం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** అర్హులైన లబ్ధిదారులకు రెండు పడక గదుల ఇండ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న రెండు పడక గదుల ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుపేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇండ్లు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిర్మాణంలో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం కమిషనరేట్ ఏ హెచ్ టి యు ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు



**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ భద్రతపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించే ఉద్దేశంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏ హెచ్ టి యు) ఎస్.ఐ. శైలజ ఆధ్వర్యంలో నాలుగు విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాలు సెంట్ క్లేర్స్ హై స్కూల్ (ఎన్‌టీపీసీ), శ్రీ చైతన్య డిగ్రీ కాలేజ్ (గోదావరిఖని), కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల (సీసీసీ, నస్పూర్), ఏకలవ్య ఆశ్రమం -- సేవా భారతీ (మంచిర్యాల)లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఐ. శైలజ విద్యార్థులకు లింగ సమాన త్వం, బాల్య వివాహాల నిర్మూలన, పిల్లల భద్రత, పితృస్వామ్య భావజాలం, మహిళలపై ద్వేషం, లింగ వివక్ష, జెండర్ బైయాస్, హింస, సైబర్ నేరాలు, సైబర్ బులీయింగ్ వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా షీ టీమ్స్ కార్యకలాపాలు, మహిళలు మరియు పిల్లలు ఎదుర్కొనే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు డయల్ 100, 112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 గురించి తెలియజేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతలో భద్రతపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించిన ఎస్.ఐ ఉదయ్ కిరణ్



**జన్నారం, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి)** జన్నారం మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ఎస్.బి.ఐ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్.ఐ ఉదయ్ కిరణ్, ఎస్.బి.ఐ మేనేజర్ అంకిత్ లు ప్రారంభించారు. గత 16 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం వేసవిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండల ప్రజల దహార్తిని తీర్చడానికి ఎస్.బి.ఐ వద్ద ఏర్పాటు చేసి బ్యాంక్ కస్టమర్లకు ఇటు మార్కెట్ స్థానిక ప్రజలకు చక్కగా ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ వాటర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ లయన్ అనుమల రాజన్న తెలియజేశారు. స్థానిక ఎస్సై ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు తోట లచ్చన్న, కార్యదర్శి ఎర్ర ప్రవీణ్ కుమార్, క్లబ్ ట్రెజరర్ ప్రేమ్ సాగర్, క్లబ్ జోన్ చైర్ పర్సన్ కస్తూరి సతీష్, డిస్ట్రిక్ కోఆర్డినేటర్లు ఏనుగు శ్రీకాంత్ రెడ్డి, జక్కు భూమేష్, అంజితరావు, లయన్స్ క్లబ్ సభ్యులు మారుతి రాజు, సైన్ల మల్లేష్, వెలగందుల సురేష్, గుండ పవన్, వావిలాల రాజేందర్, గుండ సుధాకర్, మిక్కిలినేని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## జిల్లా కలెక్టర్ ను కలిసి పుష్ప గుచ్ఛంను అందించిన నూతన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)

యువరాజ్ మార్మట్



**కొమరం భీమ్ జిల్లా ప్రతినిధి ( వాంకిడి) ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ చాంబర్ లో ఇటీవల జిల్లాకు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలుగా ప్రమోషన్ పై వచ్చిన యువరాజ్ మార్మట్ స్థానిక జిల్లా కలెక్టర్ హరిత ను కలిసి పుష్ప గుచ్చం అందించారు అనంతరం తన చాంబర్ లో అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించారు సందర్భంగా మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికారులు ప్రజా ప్రతినిధుల సహకారంలో కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్ అదనపు కలెక్టర్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు

# టి జి డబ్ల్యు డబ్ల్యు సి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం

**జన్నారం,ఏప్రిల్28(ప్రజాజ్యోతి)**తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవ సందర్భంగా చనిపోయిన కార్మికులను స్మరించుకుందాం-బ్రతికున్న వారి కోసం పోరాడుదాం అనే నినాదంతో మంగళవారం రోజున సమావేశం అయ్యారు.ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య మాట్లాడుతూ ఈ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి దాదాపు 3 సంవత్సరాలు గడుస్తున్న గల్ఫ్ కార్మికులు ఇచ్చిన హామీలు అమలు కాక గల్ఫ్ కార్మికుల కోసం చేసిందేమీ లేదని, ఇప్పటివరకు గల్ఫ్ దేశాలలో రాష్ట్రం ఏర్పడి నుండి చనిపోయిన శవపేటికలు 1900 కు పైగా రావడం జరిగిందని వారి కుటుంబాలను ప్రభుత్వాలే ఆదుకోవాలని కోరారు.గల్ఫ్ లో చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షలు ఎక్స్గ్రేషియా కొన్ని కుటుంబలకు ఇచ్చినప్పటికీ, ఇంకా ఇవ్వ వలసిన మిగతా కుటుంబాలకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.గల్ఫ్ నుండి ఇంటికి తిరిగి వచ్చిన వలస కార్మికులను కనీస ఆసరా ఇస్తూ వారిని ఆదుకునే అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా వారికి ప్రభుత్వ లోను ద్వారా కొంత సొమ్మును ఇస్తూ వారి జీవనాధారానికి సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వాలు గల్ఫ్ కార్మికులను చిన్నచూపు చూస్తే గడపగడపకు వెళ్లి ప్రతి గల్ఫ్ కార్మికుని ఏకం చేసి పసుపు బోర్డు తరహాలో గల్ఫ్ బోర్డు ఎన్నారై పాలసీ కొరకై పోరాటానికి సిద్ధమవుతామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రవాస దివాస్ దినోత్సవం ప్రభుత్వమే జరిపించాలని వారు పేర్కొన్నారు. ప్రతీ గల్ఫ్ కార్మికునికి ప్రభుత్వం బీమా పథకం కల్పించాలన్నారు. ముంబయి లో ఏర్పాటు చేసిన విధంగా "విదేశ్ భవన్" ను హైదరాబాద్ లో ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ (సమీకృత




సముదాయం) లో పాసు పోర్టు ఆఫీసు, ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్స్ ఆఫీసు, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసిసిఆర్) రీజనల్ ఆఫీసు, విదేశాంగ శాఖ బ్రాంచి సెక్రెటేరియట్ లు ఉంటాయన్నారు. 38 ఏళ్లనాటి ఎమిగ్రేషన్ యాక్టు, 1983 స్థానంలో నూతన ఎమిగ్రేషన్ యాక్టు, 2021 ను తీసుకరావాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఎన్నారైలకు 'ప్రాగ్జీ' ఓటింగు (ప్రతినిధి ద్వారా, పరోక్ష పద్దతిలో ఓటు వేయడం) లేదా ఆన్ లైన్ ఓటింగు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గల్ఫ్ దేశాల జైళ్లలో మగ్గుతున్న భారతీయులు న్యాయ సహాయం కోసం ఎదురుచూస్తున్నారనీ, వారికీ కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించి స్వదేశానికి తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సేపురి గోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరగొండ తిరుపతి, పెరుగు మల్లికార్జున్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలాజీ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసెట్టి తిరుపతి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహమ్మద్ హస్సన్, జన్నారం మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎలయ్య, సత్తయ్య, వివిధ గ్రామాల గల్ఫ్ కార్మికులు అందరూ పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లో శానిటరీ సర్టిఫికెట్ల జారీ పై అనుమానాలు

**మంచిర్యాలరూరల్ ఏప్రిల్28 (ప్రజాజ్యోతి)** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ సర్టిఫికెట్ జారీ ప్రక్రియపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని శ్రీహర్ష జూనియర్ కళాశాలకు ఈనెల 6న కార్పొరేషన్ జారీ చేసిన సానిటరీ సర్టిఫికెట్ జారీలో తీవ్రలోపాలు జరిగాయాని సమాచారం తెలిసింది.


OFFICE OF THE MANCHERIAL MUNICIPAL CORPORATION
DIST: MANCHERIAL
SANITARY CERTIFICATE

విద్యార్థుల ఆరోగ్య భద్రతకు అత్యంత ముఖ్యమైన ఈసర్టిఫికెట్‌ను నిబంధనలకు విరుద్ధంగా, నిర్లక్ష్యంగా జారీ చేస్తున్నారన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. సాధారణంగా ఒక విద్యాసంస్థకు శానిటరీ సర్టిఫికెట్ జారీ చేయాలంటే హెల్త్ ఆఫీసర్, సానిటరీ ఇన్స్పెక్టర్,సానిటరీ సూపర్వైజర్ ముగ్గురు కలిసి సమగ్రమైన పరిశీలన జరిపి కార్పొరేషన్ కమీషనర్ కి నివేదిక సమర్పించాలి. కానీ మంచిర్యాల కార్పొరేషన్‌లో హెల్త్ ఆఫీసర్ పోస్టు ఏడాది కాలం పైనే ఖాళీగా ఉండటం అడ్మినిస్ట్రేషన్ వ్యవస్థలోని నిర్లక్ష్యానికి నిదర్శనం.ఇలాంటి సంఘటనలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఒక్కరు మాత్రమే పరిశీలన జరిపి,సానిటరీ సూపర్వైజర్ విచారణ లేకుండానే కార్పొరేషన్ కమిషనర్‌కు ఇన్స్పెక్షన్ ఫైల్ రిపోర్ట్ సబ్మిట్ చేసారని కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సానిటరీ సూపర్వైజర్ పాత్రను పూర్తిగా పక్కన పెట్టడం కూడా చట్ట పరమైన ప్రక్రియను




ప్రశ్నార్థకంగా మారుస్తోంది.తెలంగాణ మున్సి పల్ చట్టం-2019 నిబంధనల ప్రకారం విద్యాసంస్థల్లో విద్యార్థులకు త్రాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు,తరగతి గదులు,కళాశాల పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై సమగ్రంగా పరిశీలించి అనంతరం శానిటరీ సర్టిఫికెట్ జారీ చేయాలి.అధికారులు ఈ కీలక అంశాలను పరిగణలోకి తీసుకోకుండా సర్టిఫికెట్లు జారీ చేసారని ప్రజలు అనుమానాలు వ్యక్తపరుస్తున్నారు.మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే,ఇలాంటి విధానాలు కార్పొరేషన్‌లో పరిపాటిగా మారుతున్నాయన్న ప్రచారం లేకపోలేదు.అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం,బాధ్యతారాహిత్యం స్పష్టంగా బయటపడు తోంది.విద్యార్థుల ఆరోగ్యంతో సంబంధం ఉన్న ఈ అంశంపై జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరిపి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మంచిర్యాల నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడానికే



**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**మంచిర్యాల నియోజక వర్గ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కీ.శే. కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగు తున్నాయి.మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖల మార్గదర్శ కత్వంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మూడవ రోజు మంగళవారం బస్టాండ్, మార్కెట్, ఐబీ చౌరస్తా, హమాలీవాడ, సీసీసీ కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ ప్రాంతాల్లో ఉచితంగా అంబలి పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రజలకు అంబలి అందించారు. వేసవి ఎండల నుంచి ఉపశమనం కలిగించేందుకు ఈ సేవా కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తోందని స్థానికులు తెలిపారు.

# సేవా భావంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలి

**మేయర్ ధర్ని మధుకర్**

**గురు విశ్వస్ఫూర్తి గురువు 86వ జన్మదిన వేడుకలలో మజ్జిగ పంపిణీ**



**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** గురు విశ్వస్ఫూర్తి గురువు 86వ జన్మదిన వేడుకల సందర్భంగా మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.మంచిర్యాల స్ఫూర్తి చలివేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ ధర్ని మధుకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మేయర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే గురు విశ్వస్ఫూర్తి గురువు రచించిన గ్రంథాన్ని కూడా మేయర్ కు అందజేశారు.ఈ సందర్భంగా మేయర్ ధర్ని మధుకర్ మాట్లాడుతూ, "గురు విశ్వస్ఫూర్తి గురువు బోధనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. సేవా భావంతో నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలి. ముఖ్యంగా వేసవి కాలంలో మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తాయి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, భక్తులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు కూడా గురువు ఆశయాలను కొనసాగిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

# మే డే స్ఫూర్తి-నేటి సింగరేణి కార్మికుల జీవన స్థితి

ఆళవందార్ వేణు మాధవ్, ప్రధాన కార్యదర్శి, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్

**మంచిర్యాల,28,ఏప్రిల్ (ప్రజాజ్యోతి):**మే డే స్ఫూర్తి తోనే నేటి సింగరేణి కార్మికుల జీవన స్థితి కొనసాగుతుందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు . "మే" డే కు సంబంధించి పలు అంశాలను తెలిపారు ప్రపంచ వ్యాప్తంగా మే 1 ను జరుపుకునే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం కేవలం భారత దేశం లోనే కాకుండ ప్రపంచంలోని అన్ని దేశాల కార్మికులు జరుపు కుంటారు.ఇది కార్మికుల రక్తం,చెమట, పోరాటాలతో సాధించిన హక్కుల చిహ్నం. 1, మే, 1886 న అమెరికాలోని చికాగో నగరం లో హే మార్కెట్ వద్ద వెట్టి చాకిరికి నిరసనగా అధిక పనిగంటలకు వ్యతిరేకంగా 8గంటల పని విధానం కొరకు నిరసన కార్యక్రమం కోసం కార్మికులు సమావేశం జరుపుకున్నారు. ఈ సమావేశాన్ని చెదరకొట్టడానికై పోలీసుల కాల్పుల్లో 4 గురు కార్మికులు మరణించినారు. చాలా మంది గాయపడగా రక్తం ఏరులై పారింది. ఆ రక్తం లో తడిసిన చొక్కాలను పైకి ఎత్తి "ప్రపంచ కార్మికులారా ఏకం కండి"అని నినదించిన రోజు.ఇటువంటి సంఘటనలు కార్మికుల జీవన గాథలో ఒక మలుపు తీసుకువచ్చాయి. రోజుకు 8 గంటల పని సమయం కోసం జరిగిన ఆ పోరాటం ప్రపంచ కార్మిక ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచింది. భారతదేశంలో కూడా మే డే ఒక గొప్ప చరిత్రను కలిగి ఉంది. 1, మే ,1923 న లో చెన్నైలో సింగరవేలు చెట్టియార్ ప్రారంభించిన ఈ దినోత్సవం, కార్మికుల ఐక్యతకు ప్రతీకగా మారింది. అప్పటి నుంచి కార్మిక వర్గం తమ హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉంది.సింగరేణి బొగ్గు గనులలో వెట్టి చాకిరి నిరసనగా, గాలి, నీరు, ఇంటి వసతుల గురించి తదితర కనీస సౌకర్యాల కోసం డి.శేషగిరి చేసిన పోరాటం నేటికి స్ఫూర్తి దాయకం.1942 సంవత్సరంలో సింగరేణి కార్మికుల సమస్యల పై మనుబోతుల కొమురయ్య ఆధ్వర్యంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) స్థాపించబడింది. ఆనాడు నిజాం సర్కార్ కు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలోలో కె.ఎల్.మహేంద్ర, బి.విఠల్ రావు లాంటి ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా బోనస్ సాధించిన ఘనత సింగరేణి కార్మికులదే, వేజ్ బోర్డ్ సాధన,లాభాల వాటా,ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కొరకు పోరాడిన సింగరేణి కార్మికులు దేశానికే ఆదర్శవంతులు. సమ్మెలు,పోరాటాలు చేసి సాధించుకున్న పెన్షన్ ఫండ్ ప్రభుత్వాల సహకారం అందించకపోవడంతో భవిష్యత్తులో పెన్షన్ ఫండ్ ప్రశ్న గా మిగిలుతుందోమోనని ఆందోళన చెందుతున్నారు కరువు భత్యం తో కూడిన పెన్షన్ లేక పోవడంతో రాను రాను విశ్రాంత కార్మికుల జీవనం దిగజరుతుంది. పెరిగిన జీవన వ్యయం,వైద్య ఖర్చులు భరించలేక తల్లడిల్లు తున్నారు. ప్రకృతి విరుద్ధంగా ఊపిరి ఆడని,గాలి,వెలుతురు లేని స్థితిలో విషవాయువులు ప్రసరిస్తున్నను పని చేసి దేశానికి వెలుగు నిచ్చిన సింగరేణి కార్మికులు త్యాగధనులు.అయితే,నేటి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ,టెక్నాలజీ విప్లవం కార్మిక రంగాన్ని కొత్త దిశలో నడిపిస్తున్నాయి. స్థిర ఉద్యోగాలు తగ్గిపోతూ, కాంట్రాక్ట్ ఉద్యోగాలు పెరుగు తున్నాయి.ఉద్యోగ భద్రత తగ్గిపోవడం, ఎక్కువ పని గంటలు, తక్కువ వేతనాలు, సామాజిక భద్రత లోపం వంటి సమస్యలు కార్మికుల జీవితాలను సంక్లిష్టం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన లేబర్ కోడ్స్ ఒక కీలక మలుపు. పాత 29 కార్మిక చట్టాలను కలిపి రూపొందించిన ఈ నాలుగు కోడ్స్ --- వేతన కోడ్, పరిశ్రమ సంబంధాల కోడ్, సామాజిక భద్రత కోడ్, వృత్తి భద్రత కోడ్ --- కార్మిక రంగాన్ని సరళీకృతం చేయాలనే లక్ష్యంతో తీసుకొచ్చారు. కాగితాలపై చూస్తే ఇవి సంస్కరణలుగా కనిపిస్తున్నాయి.పరిశ్రమ సంబంధాల కోడ్ ప్రకారం కంపెనీలకు ఉద్యోగులను తొలగించే స్వేచ్ఛ పెరగడం, సమ్మెలపై కఠిన నియంత్రణలు విధించడం కార్మిక హక్కులకు ముప్పుగా భావిస్తున్నారు. సమ్మె చేయడానికి ముందుగా అనుమతులు తీసుకోవాల్సిన పరిస్థితి, కార్మికుల స్వరాన్ని బలహీనపరుస్తోంది. అలాగే, వృత్తి భద్రత కోడ్ అమలు విషయంలో స్పష్టత లేకపోవడం, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల్లో కార్మికుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది.ఇక్కడ ప్రధానంగా గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే కార్మిక చట్టాలు కేవలం యాజమాన్యాల సౌలభ్యం కల్పించడానికే కాకుండా, కార్మికుల గౌరవప్రద జీవనానికి హామీ ఇవ్వాలి. అభివృద్ధి అనే పేరుతో కార్మిక హక్కులను బలహీనపరిస్తే, అది సమాజంలో అసమానతలను మరింత పెంచుతుంది.మే డే మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది: హక్కులు ఎప్పుడూ ఇచ్చేది కాదు, సాధించేది. నేటి నూతన లేబర్ కోడ్స్ నేపథ్యంలో, కార్మిక సంఘాలు మరింత అప్రమత్తంగా ఉండాలి. అదే సమయంలో ప్రభుత్వం కూడా అభివృద్ధి,కార్మిక సంక్షేమం మధ్య సమతుల్యతను పాటించాలి. సింగరేణిలో నూతన భూగర్భ గనులు రాక పోవడం,నూతన ఉద్యోగాల కల్పన తగ్గిపోవడం, మెడికల్ బోర్డ్ నిర్వహించక, వారసత్వ ఉద్యోగాలకు తిలోదకాలు పలికే దిశలో యాజమాన్యం ఆలోచించడం చూస్తే సింగరేణి కార్మికులు అంధకారంలో నెత్తివేయబడుతున్నారు. రిటైర్డ్ కార్మికులకు కనీస అవసరాలు తీర్చే పెన్షన్, మెరుగైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రిటైర్డ్ కార్మికుల అవసాన దశలో వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించే బాధ్యత ప్రభుత్వాలు, యాజమాన్యాలదే. చివరగా,దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం అయిన కార్మికుడి గౌరవం కాపాడబడితేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. మే డే స్ఫూర్తి మనకు ఇదే నేర్పుతుందని అన్నారు.



## ఎండలో కూలీలకు నీడనిచ్చిన సర్పంచ్

### ప్రథమ చికిత్స కిట్ సిద్ధం చేసిన సామెల పంచాయతీ



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి** సామెల గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సదుపాయాలు కల్పించారు. సర్పంచ్ వడ్డగ్రే సంతోష్ సోమవారం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు నీడ కోసం షామియానా, తాగునీటి కోసం వాటర్ క్యాన్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రథమ చికిత్స కిట్ కూడా అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. పనులు సక్రమంగా జరిగేలా మేట్లు పర్యవేక్షిస్తున్నారని సర్పంచ్ వడ్డగ్రే సంతోష్ వెల్లడించారు. కూలీల ఆరోగ్యం దృష్ట్యా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

## జన్నారంలో మత్తు పదార్థాలు, సైబర్ మోసాలపై పోలీసుల అవగాహన



**జన్నారం,ఏప్రిల్28(ప్రజాజ్యోతి)**మత్తు పదార్థాల వినియోగం, బ్యాంకు ఓటీపీ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జన్నారం ఎస్.ఐ ఉదయ్ కిరణ్ ఆదేశాల మేరకు పోలీసులు సోమవారం సాయంత్రం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, "యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. వీటి అమ్మకాలు, వినియోగం చట్టరీత్యా నేరం. ఎక్కడైనా డ్రగ్స్ అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వండి" అని సూచించారు.బ్యాంకు ఓటీపీ మోసాలపై మాట్లాడుతూ, "గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు అధికారులమని చెప్పి ఓటీపీ, కార్డు నంబర్లు అడుగుతారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటీపీ చెప్పవద్దు. బ్యాంకు వారు ఎప్పుడూ ఓటీపీ అడగరు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలి" అని ప్రజలకు వివరించారు.గ్రామస్తులు, మహిళలు యువత పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీసులు షీ-టీమ్స్, డయల్ 100 సేవల గురించి కూడా అవగాహన కల్పించారు.

## నకిలీ విత్తనాల దందా.. ముగ్గురు అరెస్ట్

**175 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు సీజ్**

**ఏపీ నుంచి తెచ్చి అమ్మకాలు..రైతులకు కుచ్చుటోపీబి**

**రూ.4.37 లక్షల విత్తనాలు పట్టుకున్న రెబ్బెన పోలీసులు**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ ఎస్పీ నికిత పంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు రెబ్బెన మండలం కొమురవెల్లి గ్రామంలో నిషేధిత నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సంజయ్ వివరాలను వెల్లడించారు. మంగళవారం ఉదయం వ్యవసాయ శాఖ అధికారి డి.దిలీప్ కుమార్ ఫిర్యాదు మేరకు దాడులు చేపట్టారు. కొమురవెల్లి గ్రామానికి చెందిన గజ్జెల సూర్యకాంత్ (30) వద్ద నుంచి సుమారు 175 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4,37,500గా అంచనా. గజ్జెల సూర్యకాంత్ తన స్నేహితులు ధోని రాజేష్ (36), జక్కులపల్లి, కొల్లూరి సాయికిరణ్ (27), కొమురవెల్లితో కలిసి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీనివాస్ వద్ద నుంచి ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను కొనుగోలు చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అధిక దిగుబడి వస్తుందని రైతులను మోసం చేసి విక్రయిస్తూ అక్రమంగా డబ్బు సంపాదిస్తున్నట్లు తేలింది. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇకపై నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐ వెంకటకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు

# జిల్లా కేంద్రంలోని " రాముని చెరువు " పై ప్రత్యేక కథనం

**కుదించుకుపోతున్న రాముని చెరువు... సుందరీకరణ గా మారి పూర్వ వైభవం వచ్చేనా..?**

**రాముని చెరువు పై రియల్ ఎస్టేట్ కన్ను ..?కోట్ల నిధులు కుమ్మరిస్తున్న ఫలితం ఉంటుందా..?**

**గంజాయి బ్యాచ్, ప్రేమికులకు అడ్డాగా మారుతున్న వైనం..?**





**మంచిర్యాల, ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి):**మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాముని చెరువు... ఒకప్పుడు మంచినీటి వనరుగా, పర్యావరణానికి ఆధారంగా నిలిచిన ఈ చెరువు ప్రస్తుతం కుదించుకుపోతూ తన అస్తిత్వానికే సవాల్‌గా మారింది. అభివృద్ధి పేరిట జరిగిన మార్పులు, ముఖ్యంగా రియల్ ఎస్టేట్ విస్తరణతో చెరువు చుట్టుపక్కల అక్రమాలు పెరిగాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల ప్రకారం, ఒకప్పుడు సుమారు 45--48 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు, ప్రస్తుతం ఆక్రమణలు, మట్టికట్టల కారణంగా 30--35 ఎకరాలకే పరిమితమైందని చెబుతున్నారు. చెరువు పరిధిలో అనుమతులు ఇవ్వడంలో కొందరు అధికారులు రియల్ ఎస్టేట్ వర్గాలతో కుమ్మక్కయ్యారన్న విమర్శలు వినిపించడం గమనార్హం. చెరువు ప్రస్తుత పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు తాగునీటి వనరుగా ఉన్న ఈ చెరువులో ఇప్పుడు తుంగ, తామర ఇతర మొక్కలు విపరీతంగా పెరిగి, నీటి ఉపరితలం మొత్తాన్ని కప్పేసే స్థితి ఏర్పడింది. దీంతో నీటి నాణ్యత తగ్గిపోవడమే కాకుండా, చెరువు అసలు స్వరూపం కూడా కనిపించకుండా పోతుందనే భావన వ్యక్తమవుతోంది. సుందరీకరణ పేరిట చేపట్టిన పనులపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అప్పటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం, అలాగే ప్రస్తుత ప్రజాప్రతినిధుల పేర్లతో చెరువు వద్ద శిలాఫలకాలు ఉన్నప్పటికీ, వాస్తవ అభివృద్ధి ఎంతవరకు జరిగిందన్నది స్పష్టతలో లేదు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ స్థానికులకు కొంత ఉపశమనం కలిగించినప్పటికీ, వర్షాకాలంలో అది పూర్తిగా బురదతో నిండిపోతూ ఉపయోగించలేని పరిస్థితి నెలకొంటోంది. హైటెక్ సిటీ, జాఫర్ నగర్ ప్రాంతాలకు చెందిన యువత, వృద్ధులు ఇక్కడ నడకకు వస్తున్నా, సంవత్సరం పొడవునా ఉపయోగపడేలా ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, చెరువు పరిసర ప్రాంతం చల్లని వాతావరణంతో ఉండటంతో, ఇక్కడ ఒక ప్రజా గ్రంథాలయం ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు సూచిస్తున్నారు.




### సాంప్రదాయం కొనసాగుతున్నా... పరిరక్షణలో లోపాలు......!!

రాముని చెరువు స్థానిక సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించి, "పోయిరా గౌరమ్మ... మళ్లీ రావమ్మ" అంటూ బతుకమ్మలను ఈ చెరువులోనే నిమజ్జనం చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

### అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నదా..?

చెరువు కట్ట, వాకింగ్ ట్రాక్ ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రేమ జంటలు, కొందరు యువత గంజాయి సేవించడం, ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలు పారవేయడం వల్ల చెరువు పేరు దెబ్బతినడంతో పాటు పర్యావరణం కూడా దెబ్బతింటోంది.

### గతం లోని 3.50 కోట్ల ప్రాజెక్ట్ పనులు పూర్తి అయ్యాయా ..?

రాముని చెరువు అభివృద్ధి మరియు సుందరీకరణ పనుల కోసం టియుఎఫ్ఐడిసి కింద 3.50 కోట్లతో 25, ఏప్రిల్ 2022 లో అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు శంకుస్థాపన చేశారు. పనులు పూర్తి కాలేదు .అయితే పనుల పురోగతిపై స్పష్టత లేకపోవడం ప్రజల్లో సందేహాలను పెంచుతోంది.

### తాజాగా అమృత్ 2.0 కింద కొత్త ఆశలు పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ..

ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరాల ప్రేమ్ సాగర్ రావు దృష్టికి ఈ రాముని చెరువు తో పాటు నస్పూర్ చెరువుల సమస్యలు కూడా చేరడంతో, తాజాగా 15, మార్చి 2026 న అమృత్ 2.0 పథకం ద్వారా 314.60 లక్షలతో రాముని చెరువు, నస్పూర్ చెరువుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది.

### చెరువు రక్షణ కోసం రాజకీయ, ప్రజా ఆందోళనలు

ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ చెరువును కాపాడాలని భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ వంటి రాజకీయ పార్టీలు గతంలోనూ, ప్రస్తుతం కూడా ఆందోళనలు నిర్వహించాయి. చెరువు పూర్తిగా కబ్జాల కబంధహస్తాల్లోకి వెళ్లకుండా పూర్వ వైభవం తీసుకురావాలని, పూర్తి విస్తీర్ణాన్ని కాపాడాలని, మంచినీటి సరస్సుగా అభివృద్ధి చేయాలని, బతుకమ్మ పండుగకు కేంద్రంగా నిలిపివేయాలని, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిరోధించాలని, అనే తదితర డిమాండ్లతో నిరసనలు చేపట్టారు . కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా ఇప్పటికీ చెరువు పరిరక్షణ కోసం ఆందోళనలు చేస్తున్నారు .

### పరిష్కారాలు -- ప్రజల సూచనలు...........!!

ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని, పూర్తి ఎఫ్ టి ఎల్ విస్తీర్ణాన్ని పునరు ద్ధరించడం, డీసిల్టింగ్, మొక్కల తొలగింపు, సీసీ కెమెరాలు, భద్రత ప్లాస్టిక్ నిషేధం, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, బతుకమ్మ నిమజ్జనానికి ప్రత్యేక సదుపాయాలు తదితర సూచనలు వచ్చాయి .ఏది ఏమైనా రాముని చెరువు కేవలం నీటి వనరు కాదు... సంస్కృతి, పర్యావరణం, ప్రజల జీవన విధానానికి ప్రతీక. పారదర్శకత, కఠిన చర్యలు, ప్రజల భాగస్వామ్యంతో మాత్రమే ఈ చెరువు పూర్వ వైభవం తిరిగి పొందగలదు... లేకపోతే క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 40వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**మంచిర్యాల ఎమ్మెల్యే, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు ల 40 వ వివాహ వార్షికోత్సవంను పురస్కరించుకుని మంగళవారం మంచిర్యాలలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, 14వ డివిజన్ కార్పొరేటర్ తూముల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేయర్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భగవంతుని ఆశీస్సులతో శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. మరెన్నో వివాహ వార్షికోత్సవా లను ఆనందంగా జరుపు కోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

## తాగునీటికి ఇబ్బంది రానివ్వొద్దు కలెక్టర్ హరిత

**ప్రతి ఇంటికీ భగీరథ నీరు.. లాగ్ బుక్‌లో నమోదు చేయండి**

**ఉపాధి కూలీలకు నీడ, నీరు, ఓఆర్ఎస్ అందించండి**

**వీధి దీపాలు పగలు ఆర్పండి.. కరెంటు ఆదా చేయండి**






**ఆసిఫాబాద్, ఏప్రిల్ 28:**జిల్లాలో వేసవి లో తాగునీటికి ఇబ్బందులు తలెత్త కుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులతో జూమ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేతిపంపులు, బోరుబావుల మరమ్మతులు, పైపులైన్ లీకేజీలను వెంటనే చేపట్టాలన్నారు. మారుమూల గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందని సమయంలో ప్రత్యామ్నాయంగా పంచాయతీ ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని సూచించారు. చేతిపంపులు ఎండిపోతే వ్యవసాయ బావులు, పంపుసెట్లను గుర్తించి యజమానులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నీటి సరఫరా వివరాలను లాగ్ బుక్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. తాగునీటి సమస్య ఉంటే వెంటనే మిషన్ భగీరథ అధికారులకు తెలియజేయాలన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులతో పంచాయతీ కార్యదర్శులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు.గ్రామాల్లో వీధి దీపాలు పగటిపూట కూడా వెలుగుతున్నాయని, వెంటనే ఆన్ ఆఫ్ స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ మ్యాపింగ్‌ను 100% పూర్తి చేసేలా బీఎల్ఓలకు పంచాయతీ కార్యదర్శులు సహకరించాలన్నారు. జనాభా గణనలో భాగంగా స్వీయ గణనపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని, ఉపాధి హామీ పనుల వద్ద తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియలో రైతుల నమోదుకు వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.సమావేశంలో డీఆర్డీవో దత్తారావు, మిషన్ భగీరథ ఈఈ సిద్దిక్, డీఈఈ రాకేష్, డీఎల్పీవో ఉమర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# వేధింపులపై వెంటనే ఫిర్యాదు చేయండి

-- సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

ఎస్.ఐ. ఉషారాణి




**మంచిర్యాల, 28 ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** నర్సింగ్ విద్యార్థులకు 'షీ టీమ్స్', లింగ సమానత్వం, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ -- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో జిల్లాలో ఆరు రోజుల పాటు మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో, జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్.ఐ. ఉషారాణి ముఖ్య అతిథిగా పాల్గొని వేంపల్లి ఎస్ ఆర్ కె ఎం నర్సింగ్ కళాశాల లో ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మహిళలు, పిల్లల భద్రత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. పని ప్రదేశాల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో వేధింపులు ఎదురైతే వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. లింగ సమానత్వం సమాజ అభివృద్ధికి కీలకమని, మహిళలు-పురుషులు సమాన హక్కులు పొందేలా కృషి చేయాలని అన్నారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత కల్పించడం ద్వారా సమానత్వం సాధ్యమన్నారు. బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే సామాజిక సమస్య అని, ఇవి ఆరోగ్య సమస్యలు, విద్యలో అంతరాయం, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తాయని తెలిపారు. 18 సంవత్సరాల లోపు బాలికల వివాహాలు చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. బాల్య వివాహాలపై సమాచారం తెలిసిన వెంటనే హెల్ప్‌లైన్ 1098కు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో నర్సింగ్ వృత్తి లో చేరబోయే విద్యార్థిను లు తమ వృత్తి జీవితంలో కూడా భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, అధ్యాపక బృందం, షీ టీమ్ సిబ్బంది కానిస్టేబుళ్లు శ్రవణ్, వనిత, శ్రీలత, విద్యార్థినులు పాల్గొన్నారు.

# నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నాము

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి

పాల్గొన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,28, ఏప్రిల్ ( ప్రజా జ్యోతి ):** నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు చేస్తున్నామని గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక వెంకట్ స్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలంలో 4 కోట్ల 40 లక్షల ఎస్ డిఎఫ్ నిధులతో భీమారం మండలం గెర్రెగూడెం నుంచి కాజీపల్లి వరకు వయా నర్సింగాపూర్ సుమారు నాలుగు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణ పనులకు కార్మిక మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం లో డబుల్ బెడ్ ఇండ్లు ఇస్తా అని కేసీఆర్ మోసం చేశాడని విమర్శించారు. ప్రజాపాలన లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.



. ఇందిరమ్మ ఇండ్లు సాంక్షన్ అయ్యి కట్టుకోలేని నిరుపేదలు ఉంటే తన వంతు సహాయం అందిస్తానని, చెన్నూరు నియోజకవర్గంలో ఎవరు కూడా ఇండ్లు లేకుండా ఉండకూడదని అన్నారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజలపై 8 లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపిందని ఆరోపించారు. అలాగే గతంలో చేసిన పనులకు సంబంధించి 43 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. కేవలం కమిషన్ల కోసమే గత ప్రభుత్వం పనులు చేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్క సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం లో మిషన్ భగీరథ పథకం ద్వారా రూ. 60 వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఇంటికి చుక్క నీరు అందించలేదని విమర్శించారు. చెన్నూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 400 బోర్లు వేసినట్లు తెలిపారు. త్వరలో చెన్నూరుకు బస్ డిపో తీసుకువచ్చి నిత్యం 60 బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. భీమారం లో పీహెచ్‌సీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, చెన్నూరులో ఏటీసీ సెంటర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జర్మనీలో 50 వేల ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువత వినియోగించుకోవాలని సూచించారు. సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని, అప్పుడు ప్రజల్లో గుర్తింపు, మంచి పేరు వస్తుందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన యువరాజ్ మార్యట్

జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడి



**ఆసిఫాబాద్, ఏప్రిల్ 28:** ప్రజా జ్యోతి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నూతన అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా యువరాజ్ మార్యట్ సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. జిల్లా కలెక్టర్ హరితను కలిసి పుష్పగుచ్ఛం అందించిన అనంతరం, తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. స్థానిక సంస్థల బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు. పీఆర్ఓ సంపత్ కుమార్, సంక్షేమ అధికారి భాస్కర్, పరిపాలన అధికారి కిరణ్ కుమార్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## కెరమెరిలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

సర్పంచ్ ఆధ్వర్యంలో 100 హెల్మెట్ల పంపిణీ

ఎస్పీకి శాలువాతో ఘన సన్మానం

హెల్మెట్ ధరించాలి: ఎస్పీ సూచన

రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

ప్రమాదాల నివారణలో హెల్మెట్ కీలకం



**కెరమెరి, ఏప్రిల్ 28: ప్రజా జ్యోతి** రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు కెరమెరి మండల కేంద్రంలోని అగ ర్వాడ గ్రామ పంచాయతీ లో మంగళవారం 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ వడ్గురే రోజా సొనాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు 100 హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీని సర్పంచ్ రోజా సొనాజీ శాలువాతో సన్మానించి గౌరవించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో హెల్మెట్ ధరించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. "మనిషి ప్రాణం అమూల్యం. రహదారిపై ప్రయాణించే సమయంలో నిర్లక్ష్యం ప్రాణాంతకంగా మారవచ్చు. ప్రమాదం జరిగినప్పుడు హెల్మెట్ ప్రాణాలను కాపాడే రక్షకవల యంలా పనిచేస్తుంది" అని ఎస్పీ అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తూ, రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలోఎస్సై మధుకర్ సీఐ సత్యనారాయణ గారు పోలీసు అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్థులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరుకున్నారు.

## సర్పంచ్ రోజా సోనాజీ ఆధ్వర్యంలో హెల్మెట్ల పంపిణీ

**హెల్మెట్ తప్పనిసరి: ఎస్పీ ఎస్పీ నితిక పంత్ సూచనలు**
**ప్రమాదాల నివారణే లక్ష్యం: పోలీసుల ప్రత్యేక కార్యక్రమం**
**రోడ్డు భద్రత కోసం పోలీసుల ముందడుగు**



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి** ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇస్తూ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన "అరైవ్ అలైవ్ -- పోలీసులు మీకోసం" కార్యక్రమం కింద కెరమెరి మండలం అగ్గర్‌వాడ గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ సర్పంచ్ వద్దగే రోజా సోనాజీ ఆధ్వర్యంలో 100 హెల్మెట్లను వాహనదారులకు పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం పెంచడం ముఖ్య లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితులను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలపై కూడా అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నితిక పంత్ ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, కెరమెరి సీఐ సత్యనారాయణ, ఎస్. మధుకర్ కూడా పాల్గొననున్నారు. అదేవిధంగా ఉప సర్పంచ్ పి. సురేష్, వార్డు సభ్యుడు శరత్ రాజు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని, హెల్మెట్ వాడకం తప్పనిసరి చేసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను తగ్గించి, సురక్షితమైన ప్రయాణాన్ని సాధ్యమయ్యేలా చేయాలని ఆకాంక్షించారు.

## జిల్లా కలెక్టర్ కే.హరిత ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛంను అందజేసి

**తన చాంబర్ లో అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన యువరాజ్ ఫార్మాట్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ ను పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన:**
**కలెక్టర్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్, పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్:**





**ఏప్రిల్ 27, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** జిల్లా కలెక్టర్ సమీకృత కలెక్టరేట్ భవనంలోని కలెక్టర్ చాంబర్‌లో ఇటీవల జిల్లాకు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలుగా ప్రమోషన్ పై వచ్చిన యువరాజ్ మార్మట్ జిల్లా కలెక్టర్ కె.హరితను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు అనంతరం తన చాంబర్‌లో అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. (స్థానిక సంస్థల అదనపు) కలెక్టర్ యువరాజ్ ఫార్మాట్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి అధికా రులు, ప్రజా ప్రతినిధుల సహ కారంలో కృషి చేస్తానని అదనపు కలెక్టర్ యువ రాజ్ ఫార్మాట్ తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ యువరాజ్ ఫా ర్మాట్ ను జిల్లా పౌర సంబంధాల అధికారి వై. సంపత్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, కలెక్ట రేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్ అదనపు కలెక్టర్ ను కలిసి శుభా కాంక్షలు తెలిపారు.

# క్రీడలతోనే మానసిక శారీరక ఉల్లాసం

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**
**సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత క్రీడా శిక్షణా శిబిరాలను చిన్నారులు సద్వినియోగ పరుచుకోవాలి**



**మంచిర్యాల, 28, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత క్రీడా శిక్షణా శిబిరాలను చిన్నారులు సద్వినియోగ పరుచు కోవాలని సూచించారు. సింగరేణి సంస్థ ప్రతీ ఏడాది నిర్వహించే ఉచిత క్రీడా శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా, శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఉద్యోగుల పిల్లల కోసం ఈసారి ఐదు విభాగాల్లో వేసవి ఉచిత క్రీడా శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. 25 రోజులు కొనసాగనున్న ఈ శిబిరాలను మంగళవారం ప్రగతి స్టేడియంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఖర్చుకు వెనుకాడకుండా కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని ఉద్యోగులు తమ పిల్లల కోసం సద్విని యోగం చేసుకోవాలని జీఎం కోరారు. సంస్థ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో క్రీడాకారుల ప్రోత్సాహం ఒక ముఖ్య భాగమని తెలిపారు. ప్రస్తుతం చిన్నపిల్లలు మొబైల్ ఫోన్లకు బానిసలుగా మారి ఆటపాటలు, క్రీడలు, ఔట్‌డోర్ గేమ్స్‌ను మరిచిపోతు న్నారన్నారు. ఈ వేసవి సెలవుల్లో పిల్లలను ఫోన్లకు దూరంగా ఉంచడంలో ఈ శిక్షణా శిబిరాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. శిక్షణ పూర్తి చేసిన చిన్నారులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. వాలీబాల్ 20 మంది, ఫుట్‌బాల్ 25 మంది, బాస్కెట్‌బాల్ 20 మంది, బాక్సింగ్ 20 మంది, అథ్లెటిక్స్ 25 మందికి దరఖాస్తులు ఆహ్వానించగా సుమారు 150 మందికి పైగా దరఖాస్తులు వచ్చాయి. వీరిలో 110 మందిని శిక్షణకు ఎంపిక చేశారు. 25 రోజులు నిరంతరాయంగా శిక్షణ పూర్తి చేసిన బాలబాలికలకు క్రీడా యూనిఫారం అందజేయ నున్నారు. రాష్ట్ర స్థాయి సీనియర్ క్రీడాకారులు / పీ ఈ టీ మాస్టర్ల పర్యవేక్షణలో బాలబాలికలు పైన పేర్కొన్న క్రీడాంశాలలో ప్రాథమిక అవగాహన తో పాటు మెలుకువలతో కూడిన శిక్షణ అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కా రెడ్డి, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ హానరరీ సెక్రటరీ సృజన్ పాల్, స్పోర్ట్స్ సెక్రటరీ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి బకాయిలపై సిఐటియు ఆగ్రహ నిరసనలు

## 46 వేల కోట్ల చెల్లింపుల కోసం విద్యుత్ సౌధ వద్ద మహా ధర్నా




**మంచిర్యాల, 28,ఏప్రిల్ ( ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థకు విద్యుత్ సంస్థల నుండి రావాల్సిన సుమారు 46 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ వద్ద భారీ స్థాయిలో నిరసన, ధర్నా కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. కార్మిక సమస్యలతో పాటు సంస్థ పరిరక్షణ కోసం కూడా పోరాటం అవసరమని నినదించిన నాయకులు, ఈ ఉద్యమాన్ని తొలి దశగా ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణకు కొంగుబంగారంగా పేరుగాంచిన సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బకాయిలు చెల్లించని విద్యుత్ సంస్థలకు బొగ్గు సరఫరా నిలిపివేయడంతో పాటు జైపూర్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. లాభాలు వచ్చినప్పుడు గొప్పలు చెప్పుకున్న ప్రభుత్వాలు, ఇప్పుడు సింగరేణి ఆర్థిక ఇబ్బందులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. సంస్థ అభివృద్ధి పేరుతో భారీ మొత్తాలను వేరే దారులకు మళ్లిస్తుండగా, ఉద్యోగుల జీతాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకర మన్నారు. అసెంబ్లీలో కూడా బకాయిల అంశంపై చర్చించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడించే కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం జెన్కో సిఎండి కి వినతిపత్రం అందజేశారు. స్పందించిన సిఎండి, బకాయిల చెల్లింపుపై సానుకూలంగా స్పందిస్తూ, తమకు రావాల్సిన బకాయిల సమస్య వల్ల ఆలస్యం జరుగుతోందని తెలిపారు. ఈ అంశాన్ని ఎనర్జీ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లి, ప్రతినెల కొంత మేర చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే బొగ్గు నాణ్యత పెంపుపై కూడా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు భూపాల్, అధ్యక్షులు మంద నరసింహారావు, ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి అల్లి రాజేందర్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, నారెడ్ల వెంకటరెడ్డి, సాయిల శ్రీనివాస్, మీడివెల్లి శ్రీనివాస్, తోడే సుధాకర్, ఇప్ప నరేష్, శ్రీపతి బానేశ్, జగన్మోహన్ రెడ్డి, ఒంటెల శ్రీనివాస్ రెడ్డి, సిరికొండ శ్రీనివాస్, కిషన్ రెడ్డి, అఖిల్, ఆడెపు రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## భగ భగ మండుతున్న సూరీడు

**నిప్పుల కొలిమిల ఎండలు**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 28 ,( ప్రజాజ్యోతి ).**46 డిగ్రీలు వేసవి ఉష్ణోగ్రత రోజు రోజుకు భగ్గుమంటున్నాయి. మునుపెన్నడు లేని వేసవి తాపంతో ప్రజలు అల్లాడుతున్నారు .గత నాలుగు రోజులుగా గరిష్టంగా నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. మంగళవారం నిర్మల్ జిల్లా ఉష్ణోగ్రత 46 కీ కాగా నిప్పుల కొలిమిలా మారింది .ఉదయం 9 గంటల నుండి ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. అత్యవసర పరిస్థితులలో బయటకు వెళ్లినా పూర్తి రక్షణతోనే తల పాగ ,గొడుగుతో వెళ్లుతున్నారు. ఈ ఎండలకు పిల్లలు వృద్ధులు బయటకు రాక పోవడమే ఉత్తమమని వైద్యులు సూచిస్తున్నారు.

## ప్రతి ఒక్కరూ స్వీయ నమోదు ప్రక్రియ చేసుకోవాలి



**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 28 ,( ప్రజాజ్యోతి ).**నిర్మల్ జిల్లా ప్రజలు జనగణన-- 2027లో భాగంగా నిర్వహిస్తున్న స్వీయ నమోదు ( సెల్ఫ్ ఎన్యుమరేషన్ ) ప్రక్రియను తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన-- 2027, సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.జనగణన దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, జనాభా గణాంకాల ఆధారంగానే ప్రభుత్వాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ విధానాలను రూపొందిస్తాయని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి కుటుంబం బాధ్యతాయుతంగా పాల్గొని సరైన సమాచారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో "ఇండ్ల జాబితా, ఇండ్ల గణన (హెచ్ ఎల్ ఒ)" కార్యక్రమాన్ని చేపట్టి, మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. రెండో దశ జనాభా గణనను 2027 ఫిబ్రవరిలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈసారి పూర్తిగా డిజిటల్ విధానంలో ప్రజలకు "సెల్ఫ్ ఎన్యుమరేషన్" సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు పోర్టల్ ద్వారా ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి కుటుంబ సభ్యుల వివరాలు సహా మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. నమోదు పూర్తైన అనంతరం లభించే 11 అంకెల ఎస్ఇఐడి ను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వీయ నమోదు పూర్తి చేసిన కుటుంబాలు మే 11 తర్వాత ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్లకు ఎస్ఇఐడి చూపిస్తే సరిపోతుందని, దీంతో గణన ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియపై ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సీపీఓ జీవరత్నం, డీపీఆర్వో విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పట్ట భద్రుడిగా నిలిచిన దిందా గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య మల్లుబాయి దంపతుల కుమారుడు కపిల్

### ఆనందంతో ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేసి అభినందించిన పెద్దలు గ్రామస్తులు:



**ఏప్రిల్ 28, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో. జకవర్గంలోని చింతల మానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య,మల్లు బాయి దంపతుల కుమా రుడైన కపిల్ ఎంబీబీఎస్ వైద్య విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పట్ట భద్రుడిగా వైద్యవిద్య పట్టా ను కైవాసం చేసుకున్నారు ఒక మారుమూల గ్రామా నికి చెందిన కపిల్ ఎంబిబిఎస్ పట్టా కైవాసం చేసుకోవడంతో వారి కుటుంబంలో ఆనందచా యలు అములు కున్నా యి తల్లిదండ్రులతో కలిసి అధ్యాపకుల చేత ఎంబిబి ఎస్ పట్టాను అందుకున్నా కపిల్ కు గ్రామస్తులు ప్రశంసించారు.దిందా గ్రామంలో ఆనంద భాష్పా లు మిన్నంటాయి.ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంబీబీఎస్ పట్టా అందు కున్న కపిల్ వారి తల్లి దండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆనందంతో కపిల్ ను ప్రశంసిస్తూ పెద్దలు గ్రామ స్తులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.కపిల్ యువతకు ఆదర్శంగా నిర్మిస్తారని పేర్కొన్నారు. వైద్యవృత్తిని సేవాదృక్పథంతో కొనసాగించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. కపిల్ ఎంబీబీఎస్ పట్టా గ్రామా నికే ఆదర్శమని భవిష్య త్తులో ఇలాంటి విజయా లు మరింత మంది యువత సాధించాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తూ ఆశాభావం వ్యక్తం చేశారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన కపిల్ కష్టనష్టాలను అధిగ మిస్తూ వైద్య విద్యలో తన ప్రతిభను చాటుకున్నాడు.కపిల్ ప్రాథమిక విద్యను సిర్పూర్(టి) సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పూర్తి చేసిన అనంతరం హైదరా బాద్‌లోని సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థల్లో ఇంటర్ విద్యను అభ్యసించి చిన్న నాటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుని నిరంతర శ్రమతో ముందుకు సాగుతూ 2020లో మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసి పట్టభద్రుడిగా నిలవడం గ్రామానికి ఆదర్శమని అన్నారు. గ్రామీణ నేపథ్యంలో ఉన్నప్పటికీ ఉన్నత లక్ష్యంతో కృషి చేసి విజయం సాధించిన కపిల్ యువతకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కారులకు అభయ హస్తంలో ఇంటి స్థలం పెన్షన్, మంజూరు చేయాలని

### సిర్పూర్ కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్ల కు వినతిపత్రం అందజేసిన

### సిర్పూర్(టి)నియోజకవర్గ దహెగాం మండల తెలంగాణ ఉద్యమ కారులు:







**ఏప్రిల్ 27, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియో. జకవర్గంలోని దహెగాం మండలనికి చెందిన తెలం గాణ ఉద్యమకారులకు ఉద్యమ సమయంలో తెలంగాణ రావడానికి కృషి చేసిన తమ సేవలను గుర్తించుకొని రాష్ట్ర ప్రభు త్వం అభయ హస్తంలో ఉద్యమకారులకు పెన్షన్లు ఇంటి స్థలం,ఇండ్లు మం జూరు చేయాలని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్ల కు వినతిపత్రం సమర్పించా రు.అనంతరం తెలం గాణ ఉద్యమకా రులు నారాయణ మాట్లాడుతూ గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రం ఏర్పడుట కొరకు కావేటి సమ్మయ్య ఆధ్వర్యంలో తెలంగాణ సాధనకై,ఉద్యమంలో పాల్గొని శాయశక్తుల ప్రయత్నించామని అన్నారు.ఎలాంటి ఒడి దుడికులకు లొంగకుండా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నామని అన్నారు. గత 2001నుండి 2014 వరకు తెలంగాణ ఉద్య మంలో కావేటీ సమ్మయ్య ఆధ్వర్యంలో ఉద్యమంలో చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్రము సాధించు కోవడం జరిగిందని అన్నారు. అప్పటికి అప్పటి నుండి ఇప్పటివరకుతెలంగాణ ఉద్యమకారులకు గుర్తించడం లేదని అన్నారు. రాస్తారోకోలు, ధర్నాలు, బంద్‌లు, సకల జనుల సమ్మె, రోడ్లుపై వంటవార్పు రైలురోకో, మిలియన్ మార్చ్,బహిరంగ సభలు సమావేశాలు తదితర కార్యక్రమంలో పాల్గొని పోలీస్ స్టేషన్లలో అక్రమ కేసుల నమోదైన భయ పడకుండా ఉద్యమంలో పాల్గొన్నామని అన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఉద్యమకారులను గుర్తించి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే 250చదరపు గజాలు స్థలం కేటాయించాలని, నిరుద్యోగ భృతి,పెన్షన్, ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. సిర్పూర్ నియోజకవర్గంలో గత సంవత్సరాలక్రితం తెలంగాణరాష్ట్రం ఏర్పాటుకు ఉద్యమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని అన్నారు. ఉద్యమంలో పాల్గొనని స్వార్థ నాయ కులు బతుకు దెరువు కు వచ్చిన వారు ఉద్యమంలో పాల్గొన్న దాఖలు లేని నాయకులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేనే అసలైన తెలంగాణ వాది అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల జోలికి వస్తే ఖాబార్దర్ అని హెచ్చరించారు.అసెంబ్లీ పై తెలంగాణ జెండా ఎగురా వేసింది మెదటి తెలంగాణ ఉద్యమ నాయకుడు కావేటి సమ్మయ్య అని అన్నారు.ఈ కార్యక్రమం లో పుల్గం నారాయణ, కదర్ల, నారాయణ, మేకల అర్జయ్య, బోట్లకుంట మల్లేష్, లగ్గం దామోదర్, గంధం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పంట మార్పిడి పాటించండి... సుస్థిర ఆదాయాన్ని పొందండి

**సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు**

**అగ్రికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్**



**లోకేశ్వరం ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి )** సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు పొందడానికి అవకాశం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్ అన్నారు మంగళవారం రోజున మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వ ఆదేశానుసారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతల అవగాహన కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ అగ్రికల్చర్ ఎకనామిక్స్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించి నేలతల్లిని కాపాడుకోవాలని ఆమె పిలుపు నిచ్చారు ప్రతి సంవత్సరం పంట మార్పిడి పద్ధతిని పాటించి అధిక దిగుబడులు పొందాలని భూసార పరీక్షలు ప్రతి సంవత్సరం చేసుకోవాలని ఆమె కోరారు మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను మాత్రమే వేసుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ డాక్టర్ సుమాలిని ప్రొఫెసర్ జెనెటిక్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ మండల వ్యవసాయ అధికారి గిరిరాజ్ ఏ ఈ ఓ మౌనిక స్థానిక సర్పంచ్ దడిగ జయలలిత భోజన్న మాజీ సర్పంచ్ రమణారెడ్డి వి డి సి చైర్మన్ గంగాధర్ లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మన్ కట్ట రాజారెడ్డి వీడిసి క్యాషియర్ సాయిరెడ్డి రైతులు పాల్గొన్నారు

## గిరిజన సంక్షేమ స్పెషల్ సెక్రటరీ కలిసిన పిఓ


**గిరిజన అభివృద్ధి ప్రణాళికలపై మంతనాలు**



**ఉట్నూర్, ఏప్రిల్ 28 (ప్రజాజ్యోతి )** ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ నూతనఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా పై బాధ్యతలు చేపట్టిన మంద మకరంద్, మంగళవారం హైదరాబాదులో స్పెషల్ చీఫ్ సెక్రటరీ (గిరిజన సంక్షేమ శాఖ) శ్రీ సవ్యసాచి ఘోష్ ను మర్యాదపూర్వ కంగా కలిశారు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ కి పూల మొక్కను అందించి నట్లు పిఓ తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమానికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, ఐటీడీఏ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై విస్తృతంగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ తో చర్చించినట్లు పీవో తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాల మెరుగుదల, మౌలిక సదుపాయాల విస్తరణకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేసినట్లు ప్రాజెక్ట్ అధికారి మంద మకరంద్ గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.

## స్వీయ జన గణనకు స్పందన

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 28 ,( ప్రజాజ్యోతి ).** భారత జనాభ గణన 2027 లో స్వీయ జనగణన కు మంచి స్పందన కనిపిస్తుంది . ఈ మారు ఆన్ లైన్ మొబైల్ లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తారు . ఈ సారి జనగణన గణన రెండు దశల్లో కొనసాగనుంది మొదటి దశ మే 9 న ప్రారంభమై 11 జూన్ 2026 ముగియనుంది. రెండవ దశ ఫిబ్రవరి 2027 న చెపడ్తారు. మొదట కేవలం గృహ గణన అందులో యజమాని, కుటుంబాల సంఖ్య ,ప్రాథమిక సమాచారం సేకరిస్తారు. రెండవదశలో గృహంలో ని అందరి పేర్లు వ్యక్తిగత సమాచారం క్రోఢీకరిస్తారు. మొదటి దశకు ముందుగా ఎన్యుమరెటర్లు రాక ముందే యజమాని తన స్వీయ గణన చేసుకునేలా ఆన్ లైన్ యాప్ రూపొందించారు. ఈ గణన 26 నుండి ప్రారంభమైంది. స్వీయగణన చేసుకున్న యజమానికి ఒక గుర్తింపు నంబరు నమోదవుతుంది. ఎన్యుమరెటర్ ఇంటికి వచ్చినపుడు యజమాని ఆ నంబరు ఇస్తే సరిపోతుంది.




## డ్రగ్స్‌కు దూరంగా.. చదువుకు దగ్గరగా ఉండాలి

**కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 28, (ప్రజా జ్యోతి)** బాలల రక్షణ, వారి ఉజ్వల భ విష్యత్తును కాపాడటం సమా జంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాం గుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా టీనేజ్ గర్భా ల నివారణ, ఎలోప్‌మెంట్, డ్రగ్స్ నివారణ పై ఏర్పాటు చేసి న అవగాహన సదస్సుకు ఆ యన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత "డ్రగ్స్ కు దూరంగా చదువుకు దగ్గరగా" ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాల ని పిలు పునిచ్చారు. మత్తు పదార్థాల సరఫరాదారులపై కఠిన చర్య లు తీసుకోవాలని అధికారు లను ఆదేశించారు. టీనేజ్ గర్భాలు, బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, భవి ష్యత్తు దెబ్బతింటుందని, ఇలాంటి అనర్థాలపై గ్రామ స్థా యిలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థు లు ప్రేమ వ్యవహారాలు, కేసుల బారిన పడకుండా పాఠశా లల్లో ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూ చించారు. ఆపదలో ఉన్న బాలల కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని కోరారు అనంతరం ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, రిమ్స్ డై రెక్టర్ జైసింగ్ సింగ్ రాథోడ్, ప్రిన్సిపల్ లలిత, ఇతర అధి కారులు విద్యార్థులు, తదిత రులు పాల్గొన్నారు.

## వైభవంగా నరసింహ నవరాత్రులు



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఎప్రిల్ 28 ,( ప్రజాజ్యోతి ).** శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నరసింహ నవ రాత్రులు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి నిర్మల్ జిల్లాలోని ఆయా నరసింహ క్షేత్రాలలో గత ఏడు రోజులుగా విశేష కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్ అక్క కొండ లక్ష్మీ నరసింహస్వామి దిలావర్పూర్ మండలంలోని కాలువ లక్ష్మీనరసింహస్వామి నిర్మల్ వెంకటాపూర్, వెంగ్వాపేట, సోన్ లక్ష్మీనరసింహస్వామి, లోకేశ్వ రం మండలం లోని నగర్ నారసింహ ఆలయంలో అర్చకులు నిత్య ఆరాధనతో పాటు ప్రత్యేక ఉత్సవాలు జరిపిస్తున్నారు ఈ నెల 30 న నరసింహ జయంతి సందర్భంగా విశేష అష్టోత్తర అభిషేకం,శ్రీ లక్ష్మీ నారసింహ కళ్యాణం నిర్వహించనున్నారని ఆలయ కమిటీలు తెలియజేశారు.

## సబ్సిడీ పేరుతో రైతులను మో సం చేసిన నిందితుడు అరెస్ట్

**ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రా లు 50% సబ్సిడీలో ఇప్పిస్తా మని మాయమాటలు చెప్పి లక్షల రూపాయలు వసూలు**

**ఉట్నూర్ సిఐ మడావి ప్రసాద్**



**ఉట్నూర్ , ఎప్రిల్ 28, (ప్రజా జ్యోతి)** ఉట్నూర్ మండలం పరిధిలో సబ్సిడీ పేరుతో రైతులను మో సం చేసిన నిందితుడు కామెర చంద్రమౌళి (34) తండ్రి: నారాయణ, నివాసం: చంద్రవెల్లి, బెల్లంపల్లి ను అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఉ ట్నూర్ సీఐ మడవి ప్రసాద్ తెలిపారు. నిందితుడు తాను మంచిర్యాల లోని ఫార్మర్ ప్రొ డ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ ఏపిఎస్) లో మేనేజర్ నని చెప్పి, భారత్ కిషన్ వె ల్ఫేర్ ఫౌండేషన్ ద్వారా వ్యవసాయానికి సంబంధించిన ట్రా క్టర్లు, ఇతర పరికరాలను 50% సబ్సిడీలో ఇప్పిస్తామని నమ్మ బలికాడు. ఈ క్రమంలో భూపేట గ్రామానికి చెందిన రాజమౌళి (తండ్రి: రాజన్న) వద్ద నుండి ట్రాక్టర్ కోసం రూ. 4,00,000/- ,డాక్యుమెంట్ చార్జీల పేరుతో రూ. 36,000/- వసూలు చేశాడు. గంగన్నపేట్ గ్రామా నికి చెందిన బోర్లకుంట రాజన్న వద్ద నుండి ట్రాక్టర్ కోసం రూ. 4,25,000/- తీసుకున్నాడు. దంతనపల్లి గ్రామానికి చెందిన సింగిరెడ్డి రవీందర్ రెడ్డి వద్ద నుండి గడ్డి కట్టల యంత్రం పేరుతో రూ. 1,70,0 00/- వసూలు చేశాడు. అదే గ్రామానికి చెందిన కొమ్ముల సందీప్ రెడ్డి వద్ద నుండి గడ్డి కట్టింగ్ మిషన్ పేరుతో రూ. 1, 70,000/- తీసుకున్నాడు. వీరందరికీ సబ్సిడీ ప్రక్రియకు క నీసం 100 రోజులు పడుతుందని చెప్పి మోసం చేసినట్లు వెల్లడైంది. మంగళవారం నమ్మదగిన సమాచారం మే రకు ఉట్నూర్ వినాయక చౌక్ వద్ద నిందితుడిని ఎస్ ఐ జి. విజయ్, పోలీస్ సిబ్బంది భూ పతి, నరేష్, తానాజీలు పట్టు కున్నారు. నిందితుడు గత ఎనిమిది నెలలుగా తప్పించు కుంటూ తిరుగుతూ ఈరోజు పట్టపడటం జరిగిందని తెలిపారు. అదే విధంగా ఇట్టి నిం దితుడిపై మంచిర్యాల, జగి త్యాల్, భూపాలపల్లి జిల్లాల లో కూడా వివిధ పోలీస్ స్టేష న్లలో కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించడం జరిగిందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా, రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలకు సూచన:**

ఇలాంటి మోసాలకు గురికాకుండా ప్రభుత్వ పథకాల గురించి అధికారిక వనరుల ద్వారా మాత్రమే సమాచారం తెలుసుకోవాలని పోలీసులు సూచించారు.

# శాస్త్ర సాంకేతిక ఫలాలు రైతు లకు అందినప్పుడేసాగు లాభ సాటి




జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 28, (ప్రజా జ్యోతి) వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన ఆవిష్కరణలు, పరి శోధనల ఫలాలు క్షేత్రస్థా యి లో సామాన్య రైతులకు చేరిన ప్పుడే సాగు లాభసాటిగా మా రుతుందని జిల్లా కలెక్టర్ రాజ ర్షి షా అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ సమావే శ మందిరంలో ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసా య శాఖ సంయుక్తంగా నిర్వ హించిన "ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధ న, విస్తరణ సలహా సంఘం (జడ్ ఆర్ ఈఏసి) - 2026-2 7" సమావేశానికి ఆయన ము ఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ మారుతున్న వాతావ రణ పరిస్థితులకు అనుగుణం గా, రైతులు తక్కువ పెట్టుబడి తో ఎక్కువ దిగుబడి సాధించే లా శాస్త్రవేత్తలు ఎప్పటి క ప్పుడు తగిన సలహాలు అం దించాలని కోరారు. ముఖ్యం గా అకాల వర్షాలు, పురుగుల ఉధృతిని తట్టుకునే వంగడా ల గురించి రైతులకు వివరిం చాలని, 'ల్యాబ్ నుంచి ల్యాం డ్ వరకు' అనే నినాదంతో శా స్త్రవేత్తలు క్షేత్రస్థాయి పర్యట నలు పెంచాలని ఆదేశించారు. సాగులో డ్రోన్ల వినియోగం, నే ల పరీక్షల ఆధారంగా ఎరువు ల వాడకం వంటి సాంకేతిక అంశాలపై రైతులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. కేవలం సంప్రదాయ పంటలకే పరిమి తం కాకుండా, మార్కెట్‌లో డి మాండ్ ఉన్న ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలు, అం తర పంటల సాగుపై రైతుల ను ప్రోత్సహించాలన్నారు. వ్య వసాయ అధికారులు, శాస్త్రవే త్తలు సమన్వయంతో పని చే సి విత్తన శుద్ధి నుండి పంట కో త వరకు రైతులకు అండగా నిలవాలని, ప్రభుత్వ పథకా లపై విస్తృత ప్రచారం కల్పిం చాలని పేర్కొన్నారు. అనంత రం సోయాబీన్ విత్తనోత్పత్తి, సోయాబీన్ చీడ పీడలకు సం బంధించిన అవగాహన కరదీ పికను కలెక్టర్ ఆవిష్కరించా రు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, పి.జె.టి.ఎస్. ఏ.యు పరిశోధన సంచాలకులు డా. ఎం. బాల్ రాజ్, విస్తరణ సం చాలకులు డా. యాకాద్రి, ప్రి న్సిపల్ సైంటిస్ట్ డా. శ్రీధర్ చౌ హాన్, వ్యవసాయ మిషనరేట్ ప్రతినిధి అనిత, జిల్లా వ్యవ సాయ శాఖ, వివిధ జిల్లాల అధికారులు, సిబ్బంది, శాస్త్ర వేత్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ ఫ్రమ హోమ్ కు డిమాండ్

హైదరాబాద్ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ దేశాలతో పాటు భారత్‌లోనూ చమురు, గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చమురు కంపెనీలు పెట్రోల్ బంకులకు సరఫరా చేసే పెట్రోల్, డీజిల్ నిబంధనలు మార్చడంతో చాలా రాష్ట్రాల్లో ఇబ్బందులు మొదలయ్యాయి. ఏపీతోపాటు తెలంగాణ రాజధాని హైదరాబాద్ లోనూ పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. బంకుల వద్ద వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం గంటల తరబడి బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత తీవ్ర మవుతున్న నేపథ్యంలో వర్క్ ఫ్రమ్ హోం డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించింది. ఈ సమయంలో ఉద్యోగులకు కంపెనీలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇచ్చాయి. ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ కొరత నేపథ్యంలో రవాణా వ్యవస్థ స్తంభించి పోతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. పెట్రోల్, డీజిల్ కొరతతో పాటు ఎండలు కూడా మండిపోతున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటల తరువాత బయటకు వచ్చేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోంను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు కోరుతున్నారు. పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రమైతే దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించేందుకు కేంద్రం మొగ్గుచూపే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, లాక్ డౌన్ కంటే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. వర్క్ ఫ్రమ్ హోం విధానం వల్ల పెట్రోల్, డీజిల్ కొరతతో ఎదురవుతున్న ఇబ్బందుల నుంచి బయటపడంతోపాటు ఎండల నుంచి రక్షణ పొందొచ్చని, మరోవైపు ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టొచ్చని, పొల్యూషన్ తగ్గుతుందని పలువురు నెటిజన్లు సూచిస్తున్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో

## టీలా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే



నేరడిగొండ, ఏప్రిల్ 28(ప్రజాజ్యోతి): మండలంలోని రాజురా గ్రామానికి చెందిన చౌహాన్ శ్రీనివాస్ నివాసంలో టీలా కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీనివాస్ స్వగృహానికి చేరుకున్న ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. అనిల్ జాదవ్ టీలా కార్యక్రమంలో పాల్గొని, కుటుంబ సభ్యులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం గ్రామంలోని పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే వెంట మండల స్థాయి నాయకులు, ప్రజా ప్రతి నిధులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్ ఇంధ నాల కొరత లేదు

జిల్లా కలెక్టర్ రాజర్షి షా





ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 28, (ప్రజా జ్యోతి) జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫ రాలో ఎలాంటి అంతరాయం లేదని, ప్రజలకు అవసరమైన మేర నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ రాజ ర్షి షా స్పష్టం చేశారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని తన ఛాం బర్‌లో అదనపు కలెక్టర్ ఆర్. ఎస్. చిత్రుతో కలిసి చమురు కంపెనీల సేల్స్ అధికారులు, బంక్ డీలర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహిం-ారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పెట్రోల్, డీజిల్ ఇంధన సరఫరాన జావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని, వినియో గదారులు ఆందోళన చెందా ల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రవాణా ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని క్షేత్రస్థాయిలో పెట్రోల్ బంకుల వద్ద ఇంధన లభ్యతను నిరం తరం పర్యవేక్షించాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. అదేవిధంగా బ్లా క్ మార్కెటింగ్ లేదా కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించి నిల్వలను దాచిపెట్టి వినియోగదారులను ఇబ్బంది పెడితే, వారిపైని త్యావసర వస్తువుల చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను లేదా పుకార్లను నమ్మి ప్రజలు భయాం దోళనకు గురై బంకుల వద్ద రద్దీ చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకుముందు చ మురు కంపెనీ ప్రతినిధులతో నిర్వహించిన గూగుల్ మీట్ లో, డిపోల నుండి బంకులకు చేరుతున్న సరఫరా తీరుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ స మావేశంలో జిల్లా పౌర సరఫ రాల అధికారి నందిని, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధు లు, జిల్లా పెట్రోల్ డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ కు స్వాగతం పలికిన మీ సేవ నిర్వాహకులు



**సారంగాపూర్,ఏప్రిల్ 28,ప్రజా జ్యోతి** మండల నూతన తహసిల్దార్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన బి.విజయ్ కాంత్ రావు ను మండల మీసేవ నిర్వాహకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు,శాలువాతో సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు శివ ప్రసాద్ గౌడ్,క్రిసార్, మహేందర్,భూమేష్,సందీప్, మాసూద్ లు పాల్గొన్నారు.

## రైతు బజార్లలో దళారుల ప్రమేయం ఉండకూడదు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 28, (ప్రజా జ్యోతి)** జిల్లాలోని రైతు బజార్లలో మ ధ్యవర్తుల ప్రమేయం లేకుం డా, కేవలం అసలైన రైతులు మాత్రమే తమ ఉత్పత్తులను విక్రయించేలా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదే శించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యానవన, మార్కెటింగ్ శాఖ అధికారులతో రైతు బజార్ నిర్వహణపై ఆయన ప్ర త్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు, వినియో గదారులకు నాణ్యమైన కూర గాయలను అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చే శారు. రైతు బజార్లలో దళారులు చొరబడకుండా నిరంతరం నిఘా ఉంచాలని, కేవలం గుర్తింపు పొందిన రైతులకే స్టాల్స్ కేటాయించాలని సూచించారు. బహిరంగ మార్కెట్ ధరల కంటే రైతు బజార్లలో ధరలు తక్కువగా ఉండేలా చూడాల ని, ప్రతిరోజూ నిర్ణయించిన ధ రల పట్టికను వినియోగదారులకు కనిపించే విధంగా బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. తూకాల్లో ఎలాంటి మోసాలు జరగ కుండా అన్ని స్టాళ్లలో తప్పనిసరిగా డిజిటల్ తూకపు యంత్రాలనే విని యోగించేలా చర్యలు తీసుకో వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రైతు బజార్లకు వచ్చే రైతులకు, కొను గోలుదారులకు ఇబ్బంది కలగ కుండా షెడ్ నెట్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, పారిశు ద్ధ్య సౌకర్యాలను మెరుగు ప రచాలని సూచించారు. నిత్యా వసర వస్తువుల ధరలను అ దుపులో ఉంచేందుకు మార్కె టింగ్ శాఖ అధికారులు ఎప్ప టికప్పుడు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.రైతు బజార్ల ద్వారా అటు రైతులకు ఆర్థిక లాభం, ఇటు సామా న్యులకు ఉపశమనం కలగాల న్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన వివరించారు. ఈ స మీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, జిల్లా మార్కెటింగ్ అధికారి గజాన న్, ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జొన్నల కొనుగోలు సెంటర్ల ను పెంచండి

**-జిల్లా కలెక్టర్ ని కలిసిన కాంగ్రెస్ పార్టీ బృందం**



**బోథ్, ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి)**బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా జొన్నల కొనుగోలు సెంటర్లు పెంచి రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ని కాంగ్రెస్ పార్టీ బృందం కలిసి విన్నవించారు.కనీసం ప్రతి మండలానికి రెండు సెంటర్ల చొప్పున ఏర్పాటు చేసి జొన్నలు కొనుగోలు తో పాటు తరలింపుకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, మాజీ ఏఎంసి డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, సీనియర్ నాయకులు పన్నాల శమేందర్ రెడ్డి, కుమ్మరి పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## వివాహానికి ఆర్థిక సహాయం



**లక్ష్మణ చాంద, ఏప్రిల్ 29**మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన కుంటాల రజిత ముత్తన్న కూతురు వివాహానికకి ఎస్ జె డబ్ల్యూ హెచ్ ఆర్ సి నిర్మల్ జిల్లా చైర్మన్ డాక్టర్ అయిట్ల సుదర్శన్ తన వంతు ఆర్థిక సహాయంగా పెళ్లికి ముందు 11 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం రోజున ఆ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గంగారెడ్డి,మాజీ సర్పంచ్ గంగాధర్, గ్రామస్తులు ఏలేటి వెంకట్ రెడ్డి, బొమ్మిన రాజేందర్, ఎలికి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయికి ప్రజావాణి

**హైదరాబాద్ :** రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని, తద్వారా వేగంగా సమస్యలు పరిష్కారం అవుతాయని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన మరుసటి రోజున ప్రజావాణి కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ప్రతి మంగళవారం, శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి (ఛఖతీజీజీజలజీనితి) విజయవంతంగా అమలవుతోంది.అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, అప్లికేషన్లు స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రతి వారం ప్రజావాణి ద్వారా ఫిర్యాదుల స్వీకరణను నిర్వహిస్తున్నారు.

## జాతీయ కుటుంబ ప్రయోజన పథకం నుసద్వినియోగం చేసుకోవాలి



**బోథ్, ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎల్ రమేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అందూరు, ధన్నూర్-బి గ్రామాలలో ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. అనంతరం ఎంపీడీవో వివరాలను తెలుపుతూ కుటుంబంలో ప్రధానంగా సంపాదించే భర్త లేదా భార్య మృతి చెంది, మైనర్ పిల్లలు కలిగిన పేద కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ప్రభుత్వం 20వేల తక్షణ సహాయం అందిజనున్నట్లు తెలిపారు. ఇటీవల కుటుంబంలోని సంపాదించే ప్రధాన వ్యక్తి మరణించినట్లయితే ఈ పథకం కింద మీ సేవలో అప్లై చేసుకుంటే, ఆ వివరాలు ఎంపీడీవో లాగిన్ కి వస్తుందని తెలిపారు. దీంతో ఎంపీడీఓ క్షేత్ర విచారణ జరిపి, అర్హులుగా గుర్తించి డిఆర్ డిఓకి పంపించనున్నట్లు తెలియజేశా రు. ముఖ్యంగా డిఆర్డిఓ కలెక్టర్ అనుమతితో సెర్ప్ సీఈఓ కి పంపించి, ఆమోదం అనంతరం లబ్ధిదారుని అకౌంట్లో నేరుగా 20వేల రూపాయలు జమ కావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పృథ్వీరాజ్, రోహిణి వినయ్ రెడ్డి, ఏపీవో జగ్దే రావు, కార్యదర్శి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎంపీ సోయం బాపూరావు జన్మదిన వేడుకలు





**ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 28, (ప్రజా జ్యోతి)**మాజీ ఎంపీ తెలంగాణ రాష్ట్ర రాజ్ గోల్డ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపూరావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కెపిపి కాలనీలో ఆయన నివాసంలో ఈ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ వేడుక లకు వంద లాదిమంది ఆది వాసి గిరిజనులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి సోయం బాబూరావుకు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు తినిపించారు. సోయం బాపూరావుకు శు భాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున నాయ కులు, కార్య కర్తలు క్యూ కట్టారు. ఈ సంద ర్భంగా ఆయన జన్మ దినం సందర్భంగా సతీ సమేతంగా మొదట ప్రత్యేక ఇంటి దేవత కు పూజలు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు నాయకుల మధ్య కేక్ కట్ చేసి జన్మదిన ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు.